సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

సోమవారం । 23 । అక్టోబర్ । 2023



బస్సుయాత్రను జయప్రదం చేయాలి

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే రాచమల్లు కోరారు. -IIలో



చోరీల నియంత్రణకు గస్తీ

దొంగతనాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశించారు. -IIలో

గరిష్టం/కనిష్టం
35.3/22.8

వాతావరణం

జిల్లాలో ఆదివారం 22.8 – 35.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

విజయదశమి శుభాకాంక్షలు



కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల/కడప కార్పొరేషన్: జిల్లాలోని ప్రజలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆయన పేర్కొన్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు ఎస్.రఘురామిరెడ్డి, పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ సుధ, డాక్టర్ సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు డీసీ గోవిందరెడ్డి, పి.రామసుబ్బారెడ్డి, రమేష్‌యాదవ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దుష్టుల మీద దైవశక్తులు సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ అందరికీ మంచి చేకూర్చాలని వారు ఆకాంక్షించారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



కడప కోటిరెడ్డిసర్కిల్: దసరా పండుగ అనంతరం ఈ నెల 24, 25, 26 తేదీలలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్‌ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. విజయవాడ, హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, తిరుపతి, విశాఖపట్టణం తదితర ప్రాంతాలకు 150 ప్రత్యేక బస్సులు నడపనున్నామని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మైలవరం జలాశయానికి నీటి విడుదల

కొండాపురం : గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానికి 2500 క్యూసెక్కుల నీటిని గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్ట్ ఎస్‌ఈ మల్లికార్జునరెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఉదయం విడుదల చేయనున్నట్లు జీఎన్‌ఎస్‌ఎస్ డీఈ ఉమామహేశ్వర్లు ఆదివారం తెలిపారు. తాగునీటి అవసరాల కోసం నీరు వదులుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం గండికోట జలాశయంలో 19.1 టీఎంసీల నీరు నిల్వ ఉందని వివరించారు.

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా పద్మజ



కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం 83 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా కర్నూలు ఐసీడీఎస్ ఆర్‌జేడీగా పని చేస్తున్న పద్మజను ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) జోనల్ మేనేజర్‌గా బదిలీ చేశారు. పద్మజ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఈమె అంతకు ముందు వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో ఐసీడీఎస్ పీడీగా పని చేశారు. త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆమె తెలిపారు.

దుష్ట సంహారిణి.. శిష్ట సంరక్షణి





ప్రొద్దుటూరు : అమ్మవారిశాలలో మహిషాసురమర్దినిగా వాసవిమాత, అమ్మవారి దర్శనానికి పెద్ద ఎత్తున వచ్చిన భక్తజనం



కడప: శ్రీ లలితాంబిక ఆలయంలో మహిషాసురమర్దినిగా..

''అయిగిరి నందిని, నందిత మేదిని,
విశ్వ వినోదిని నందనుతే
గిరి వర వింధ్య శిరోధిని వాసిని
విష్ణువిలాసిని జిష్ణునుతే
భగవతి హే శితికంఠకుటుమ్బిని
భూరికుటుంబిని భూరికృతే
జయ జయహే మహిషాసురమర్దిని
రమ్యకపర్దిని శైలసుతే!!''..

అంటూ జగన్మాతను భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. దేవీ శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఎనిమిదో రోజైన ఆదివారం అమ్మవారు ప్రముఖ ఆలయాల్లో మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చి అభయమిచ్చారు. దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేసి, లోకం సుఖశాంతులతో ఉండేలా దీవెనలు అందిస్తారనే నమ్మకంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు నిర్వహించారు. -సాక్షి, నెట్‌వర్క్



బ్రహ్మంగారిమఠం: శ్రీ ఈశ్వరీదేవిమఠంలో దుర్గాదేవిగా..



పులివెందుల టౌన్: శ్రీ వేంకటరమణుడి ఆలయంలో మోహినీ రూపంలో..



ప్రొద్దుటూరు : రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలోని బొమ్మల కొలువు



బద్వేలు : వీరభద్రస్వామి ఆలయంలో దుర్గాదేవిగా అమ్మవారికి అలంకరణ

రారండోయ్.. వేడుక చూద్దాం..

- నేడు వైభవంగా శమీదర్శనం
- రాత్రి వాసవాంబ తొట్టిమెరవణి
- ఉత్సవాల్లో పాల్గొననున్న 2 లక్షల మందికిపైగా భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్: దసరా ఉత్సవాలు నిర్వహించడంలో రెండో మైసూరుగా పుత్తడిపురం ప్రొద్దుటూరు ప్రసిద్ధి చెందింది. ఏటా లాగే ఈ ఏడాది దేవీశరన్నవరాత్రి మహోత్సవాలను అట్టహాసంగా నిర్వహించారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం అమ్మవారికి శమీదర్శన మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాల్లో అమ్మవారి అలంకార రూపాలను దర్శించడం ఒక ఎత్తయితే.. శమీదర్శనంలో అన్ని ఆలయాల అమ్మవార్లను, దేవతా మూర్తులను ఒకే చోట దర్శించడం మరో విశేషం. అందుకే దసరా మహోత్సవాలలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్నది వాసవీమాత శమీదర్శనం. అలాగే తొట్టిమెరవణిని కనులపండువగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను దాదాపు 2 లక్షల మందికిపైగా భక్తులు తిలకిస్తారు. మధ్యాహ్నం 3.44 గంటలలోపు మకరలగ్నంలో శమీదర్శన మహోత్సవం ప్రారంభం కానుంది. పురవీధుల మీదుగా వైభవోపేతంగా అమ్మవారి శమీదర్శన మహోత్సవం కొనసాగి కొర్రపాడు రోడ్డులోని శ్రీవాసవీ శమీదర్శన మండపం చేరనుంది.



వాసవి కన్యకాపరమేశ్వరిదేవి మూలవిరాట్

- విజయానికి, సంపదకు చిహ్నమైన శమీ వృక్షాన్ని దర్శించి అమ్మవారికి పూజలు నిర్వహిస్తే శుభప్రదమని ప్రతీతి. అందువల్లనే విజయదశమి నాడు అమ్మవారికి శమీదర్శనం చేయించి తమకు విజయాలు, సిరిసంపదలు ఇవ్వాలని వేడుకుంటారు. శ్రీమహాలక్ష్మీసమేత చెన్నకేశవ స్వామి, శివాలయం, రాజరాజేశ్వరిదేవి, చౌడేశ్వరీదేవి, సత్యనారాయణస్వామి ఆలయాలతో పాటు పట్టణంలోని అన్ని ఆలయాల నిర్వాహకులు కొర్రపాడు రోడ్డు మిల్లులలోని శమీవృక్ష దర్శనానికి వివిధ కళా బృందాల మధ్య వైభవంగా చేరుకుంటారు. అన్ని ఆలయాల నుంచి వచ్చిన స్వామి, అమ్మవారి వైభవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో కొర్రపాడు రోడ్డు భక్త సంద్రం కానుంది.

విజయలక్ష్మీదేవి గ్రామోత్సవం

శ్రీవాసవీకన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారి గ్రామోత్సవం (తొట్టిమెరవణి) సోమవారం రాత్రి 11.24 గంటలలోపు మిథునలగ్నంలో ప్రారంభం కానుంది. పంచలోహంతో తయారు చేసిన తొట్టి మెరవణి రథంలో అమ్మవారి శ్రీ చక్రంను ఏర్పాటు చేస్తారు. ఈ రథం పర్యటించిన ప్రాంతాల్లో అశుభాలు, చెడులు తొలగిపోయి సర్వశుభాలు కలుగుతాయనేది భక్తుల విశ్వాసం. అమ్మవారిని విజయలక్ష్మీదేవిగా అలంకరించి పురవీధులలో తొట్టిమెరవణిని నిర్వహిస్తారు. అమ్మవారిశాల నుంచి బయలుదేరి మెయిన్ బజారు, పప్పులబజారు మీదుగా పుట్టపర్తి సర్కిల్‌కు చేరుకుంటుంది. కళ్లు మిరుమిట్లు గొలిపే చీరాల బాణసంచా పేలుళ్లు, వెలుగులతో ఆ ప్రాంతం నూతన శోభ సంతరించుకోనుంది. ఈ తొట్టి మెరవణిలో శమీదర్శనంలోని సన్నాయి మేళం, పాలకొల్లు బ్యాండు, కేరళ సింగారిమేళంతోపాటు సినీదూప్స్, డ్రమ్స్, కేరళ వారి వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు రాంమోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు తెలిపారు.

దసరా రోజు పటిష్ట బందోబస్తు

ప్రొద్దుటూరు పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్

ప్రొద్దుటూరు క్రైం: దసరా శమీ దర్శన ఉత్సవం సందర్భంగా పటిష్టమైన పోలీసు బందోబస్తును నిర్వహించాలని ఎస్పీ సిద్దార్థ కౌశల్ తెలిపారు. దసరా భద్రతా ఏర్పాట్లు పరిశీలించేందుకు ఆదివారం ఎస్పీ ప్రొద్దుటూరుకు వచ్చారు. బందోబస్తు ఏర్పాట్లపై త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దసరాలో ఎలాంటి ఘటనలకు తావులేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఏఎస్పీ ప్రేరణాకుమార్‌కు సూచించారు. దసరా ఉత్సవాలను తిలకించడానికి జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ప్రొద్దుటూరుకు వస్తారన్నారు. వారికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని చెప్పారు. అనంతరం ఎస్పీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. సీసీ కెమెరాలు ఎలా పని చేస్తున్నాయో అడిగి తెలుసుకున్నారు. అన్ని ప్రాంతాలను కవర్ చేసేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ప్రేరణాకుమార్, సీఐలు నారాయణయాదవ్, ఇబ్రహీం, రాజారెడ్డి, రమణారెడ్డి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్

మైదుకూరు అమ్మవారిశాలలో ఎస్పీ

మైదుకూరు : మైదుకూరు అమ్మవారిశాలలో ఆదివారం ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. వ్యవసాయ శాఖ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర వేర్వేరు సమయాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు.

వైవీయూ ఆచార్యునికి చైనా ఆహ్వానం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ ఆచార్యులు ఎం.వి.శంకర్‌కు చైనాలోని జియాంగ్సు యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆయన చైనాకు పయనమయ్యారు. ఈనెల 30 వరకు చైనాలోని విశ్వవిద్యాలయంలోని అధికారులను కలుస్తారు. ఈ సందర్శన ఉద్దేశం రెండు విద్యా సంస్థల మధ్య పరిశోధన, విద్యాపరమైన సహకారం గురించి చర్చించనున్నారు. చైనా ప్రభుత్వం నిధులు సమకూర్చే కొత్త ప్రాజెక్టును ప్రారంభించేందుకు జియాంగ్సు యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఆచార్యులు చావోయాన్‌తో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. పరిశోధన, విద్యాప్రయోజనాల కోసం అవగాహన ఒప్పందంపై సంతకాలు చేయడంపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

సురక్షితం.. వేగవంతం

- చౌకగా ఆర్టీసీ కార్గో సేవలు
- ప్రజలకు పెరిగిన నమ్మకం
- సంస్థ ఆదాయంలో గణనీయ వృద్ధి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం.. సుఖవంతమనేది నినాదం. మరోవైపు ఇదే నినాదాన్ని కార్గో సేవలోనూ ఆర్టీసీ ఆచరణలోకి తీసుకు వచ్చింది. సరుకులను సురక్షితంగా, భద్రంగా, సకాలంలో గమ్యస్థానాలకు చేర్చుతోంది. ప్రజల్లో కూడా నమ్మకాన్ని కల్పిస్తోంది. అందుకే ఆర్టీసీ కార్గో సేవలకు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. తద్వారా సంస్థకు అదనపు ఆదాయాన్ని చేకూర్చుతోంది. జిల్లాలో కడప, బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల డిపోలు ఉన్నాయి.



కార్గో పార్శల్‌ను బుక్ చేస్తున్న ప్రజలు

చౌకగా రవాణా

జిల్లాలోని ఆరు డిపోల నుంచి కార్గో సేవల్లో వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పుస్తకాలు, మందులు తదితరాలు తక్కువ చార్జీలతోనే రవాణా చేస్తున్నారు. ఏడాదికేడాది కార్గో ఆదాయం పెరుగుతూ వస్తోంది. జిల్లాలో కార్గో సేవల ద్వారా 2021-22లో రూ.7.21 కోట్లు, 2022-23లో రూ.9.42కోట్లు, 2023-24లో ఇప్పటి వరకు రూ.4.66 కోట్ల ఆదాయాన్ని ఆర్జించడం జరిగింది. జిల్లాలో సుమారు ఎనిమిది గంటల్లోపు సరుకులను రవాణా చేస్తున్నారు. రాష్ట్రంలోనైతే 24 గంటల్లోగా చేర్చుతున్నారు.

యువతకు ఉపాధి

ఏపీఎస్ ఆర్టీసీ కార్గో సేవలతో ఓవైపు ఆర్టీసీకి ఆదాయంతోపాటు మరోవైపు నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తోంది. జిల్లాలోని ఆరు డిపోల నుంచి సరుకు రవాణా చేయడమే కాకుండా ఆయా ప్రాంతాల్లో కూడా కార్గో పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. కార్గో వ్యాపారంలో భాగస్వామ్యాన్ని కల్పించి కొన్ని ప్రాంతాల్లో ఏజెంట్లను కూడా నియమించింది. దాదాపు 100-200 మంది కలాసీ (కూలీ)లకు కూడా పనులు కల్పిస్తోంది. నిరుద్యోగులకు ఫ్రాంచైజీ ఏజెన్సీలు ఇస్తున్నారు. ఈ ఏజెన్సీల ద్వారా కేవలం బుకింగ్, డెలివరీ సదుపాయాలే కాకుండా ఆర్టీసీ బస్సు టిక్కెట్లను అడ్వాన్స్ బుకింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు.

డోర్ డెలివరీ

కార్గోకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 84 కేంద్రాల్లో డోర్ డెలివరీ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. వైఎస్సార్ జిల్లాలో జమ్మలమడుగు, బద్వేలు, కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందులలో పార్శళ్లను బుక్ చేసే సౌకర్యం కల్పించారు.

మూడేళ్లుగా కార్గో ఆదాయ వివరాలు

డిపో	2021-22 (రూ. లక్షల్లో)	2022-23 (రూ. లక్షల్లో)	2023-24 (రూ.లక్షల్లో)
బద్వేలు	35.83	43.27	23.97
జమ్మలమడుగు	69.15	79.24	32.96
కడప	296.63	394.26	188.49
మైదుకూరు	124.93	162.52	69.11
ప్రొద్దుటూరు	154.66	215.27	124.9
పులివెందుల	39.96	47.87	27.18
మొత్తం	721.16	942.43	466.61

(ఇప్పటి వరకు)

ఆన్‌లైన్ ట్రాకింగ్ సిస్టమ్



వ్యాపార వర్గాలు, ప్రజలకు మరింతగా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం. అలాగే వ్యాపారులు వారి సరుకులు ఎక్కడ ఉన్నాయో తెలుసుకునేందుకు ఆన్‌లైన్ ట్రాకింగ్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చాం. - పి.గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, కడప

దసరా పండుగ రోజు ట్రాఫిక్ ఆంక్షలు

ప్రొద్దుటూరు క్రైం : శమీ దర్శనం సందర్భంగా సోమవారం ప్రొద్దుటూరులో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. ఆదివారం ఏఎస్పీ మాట్లాడుతూ అమ్మవారిశాల నుంచి దర్గాబజార్, లైట్‌పాళెం, శివాలయం, రాజీవ్ సర్కిల్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా కొర్రపాడు రోడ్డులోని పెద్దమ్మ చెట్టు వరకు భక్తుల రద్దీ ఉండటం వల్ల ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు చెప్పారు. పట్టణంలోకి వచ్చే వారు ఇరువైపులా రింగురోడ్డు మీదుగా రాకపోకలు సాగించాలన్నారు. బైక్‌లు, కార్లను హోమస్‌పేటలో సెంట్రల్ పార్క్ చేయరాదని సూచించారు.

విద్యార్థి అదృశ్యం


కె.నితిన్ రెడ్డి(ఫైల్)

కలికిరి : మండలంలో విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అద్దవారిపల్లికి చెందిన కె.ప్రసాద్ రెడ్డి కుమారుడు కె.నితిన్ కుమార్‌రెడ్డి (13) మేడికుర్తి బీసీ హాస్టల్‌లో ఉంటూ 8వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 12న అద్దవారిపల్లికి వచ్చి మళ్లీ ఇంటికి వస్తానని చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ కోసం వెతికినా లభించక పోవడంతో శనివారం విద్యార్థి తండ్రి కె.ప్రసాద్ రెడ్డి కలికిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విద్యార్థి ఆచూకి తెలిసిన వారు కలికిరి పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

మహిళ ఆత్మహత్య

కడప అర్బన్ : కడప రిమ్స్ పీఎస్ పరిధిలో శివానందపురంలో తాసిమా (33) అనే మహిళ, తనతో సహజీవనం చేస్తున్న వెంకటరమణతో మనస్పర్థలు ఏర్పడటంతో శనివారం రాత్రి ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చింతకొమ్మదిన్నెకు చెందిన తాసిమాకు వివాహమై భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలోనే వెంకటరమణతో నాలుగేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త సహజీవనానికి దారి తీసింది. వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటన స్థలాన్ని రిమ్స్ ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు.



అపురూపం.. అమ్మవారి దివ్యరూపం

దేవీనవరాత్రుల్లో దేదీప్యమానంగా అలంకారాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : సిరిపురిగా పేరుగాంచిన ప్రొద్దుటూరు పట్టణం దసరా వేడుకలను నిర్వహించడంలో రెండో మైసూరుగా ఖ్యాతి గడించింది. ఈ ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున చేరుకుంటారు. దసరా వేడుకల్లో పూజలతోపాటు అమ్మవారి అలంకారానికి ప్రత్యేకత ఉంది. నవరాత్రుల్లో అమ్మవారిని ఒక్కోరోజు ఒక్కో రూపంలో అలంకరించడం ఆనవాయితీ. అమ్మవారి రూపాలైన రాజరాజేశ్వరీదేవి, భవానిదేవి, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, సరస్వతీ, అన్నపూర్ణ, బిల్వవృక్షవాసినీ పార్వతీదేవి, మహిషాసుర మర్దిని, విజయలక్ష్మి, గజలక్ష్మి, శారదాదేవి వంటి దేవతామూర్తుల అవతారాల్లో అమ్మవారిని తీర్చిదిద్ది భక్తులకు కనుల విందు చేయడం దసరా ఉత్సవాల ప్రత్యేకత. అమ్మవారి ఉత్సవమూర్తికి అందంగా చీరకట్టడం మొదలు ఒక్కో అవతారానికి సంబంధించిన హస్తాలు, పాదాలు, మరుకం, పాశాంకుశాలు, అభయహస్తం, ఖడ్గం వంటి ఆయుధాలు, వాహనం, పక్షులు, ఆభరణాలతో అమ్మవారిని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతారు. చామంతి, గుండుమల్లె, రోజా, పన్నీరు ఆకు, రకరకాల గులాబీమాల, తోమాల, గజమాల, సంపంగి మాలలతో అలంకరణ పూర్తయ్యేసరికి దాదాపు 3 నుంచి 5 గంటల సమయం పడుతుంది. మహిషాసురమర్దిని అలంకారానికి మరింత సమయం పడుతుంది. ఉత్సవ విగ్రహాన్ని వివిధ అమ్మవారి రూపాల్లో అలంకరించే నైపుణ్యం వీరి సొంతం. రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో తమిళనాడు వేలూరుకు చెందిన సోముగురుకుల్ అమ్మవారి అలంకారాలను చేయడంతోపాటు పుష్పాలంకరణ చేస్తున్నారు. అమ్మవారిశాల, మహాలక్ష్మీసమేత చెన్నకేశవస్వామి, శివాలయం, రాజరాజేశ్వరిదేవి, చౌడేశ్వరిదేవి తదితర ఆలయాల దసరా ఉత్సవ కమిటీవారు కర్ణాటక, తమిళనాడు, విజయవాడ, ప్రాంతాల కళాకారులతో అమ్మవారిని సుందరంగా అలంకరిస్తున్నారు.


రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని అలంకరిస్తున్న దృశ్యం


పూల దండలు కడుతున్న దృశ్యం

దసరా వేడుకల్లో అమ్మవారిని అలంకరిస్తున్నా



దేవీ శరన్నవరాత్రి సందర్భంగా ప్రతి రోజు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరిస్తున్నాను. అమ్మవారికి చీరకట్టి, అభయ హస్తాలు, పాదుకలు, ఆయుధాలు, పూల అలంకరణ, చీరెలతో సుందరంగా తీర్చిదిద్దేందుకు అధిక సమయం పడుతుంది. 18 ఏళ్లుగా దసరా ఉత్సవాల్లో అమ్మవారిని అలంకరిస్తున్నాను.

- సోము గురుకుల్, వేలూరు

కర్ణాటక మద్యం స్వాధీనం


నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్‌ఈబీ పోలీసులు

మదనపల్లె: కర్ణాటక నుంచి టాటా సుమోలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురిని అరెస్ట్‌చేసి, 20 బాక్సుల మద్యం, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. ఆదివారం ఎస్ఈబీ అధికారులకు అందిన ముందస్తు సమాచారం మేరకు పట్టణ శివారు ప్రాంతం అమ్మచెరువుమిట్ట వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, టాటాసుమోలో మద్యం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వాహనాన్ని సీజ్ చేయడంతో పాటుగా మద్యం అక్రమ రవాణాలో ప్రధాన సూత్రధారి, అంగళ్లు సమీపంలోని డాబా నిర్వాహకుడైన సూర్యచంద్రారెడ్డి అలియాస్ డాబాసూరి(45), అతడి అనుచరుడైన నరేష్(42), కర్ణాటకకు చెందిన సుమో డ్రైవర్ బాలాకుమార్(30)లను అరెస్టు చేశామన్నారు. వీరు ముగ్గురితో పాటు ప్రధాన నిందితుడైన డాబాసూరికి సహకరిస్తున్న కర్ణాటకకు చెందిన మరొక వ్యక్తిపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ నాయకునికి తీవ్ర గాయాలు


రామమోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

పెండ్లిమర్రి : నందిమండలం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్, సర్పంచ్ సి.రామమోహన్‌రెడ్డి ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంలో కడప ప్రకాశ్‌నగర్‌లోని తన ఇంటికి వెళుతుండగా మలుపు వద్ద స్కూటీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని తొలుత రిమ్స్‌కు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి పరామర్శించారు.

దంపతుల ఆత్మహత్య


రవిశంకర్ ఆచారి, సరస్వతమ్మ (ఫైల్)

చెన్నూరు : కుటుంబ కలహాలతో దంపతులు కొర్రపాటి రవిశంకర్ ఆచారి(52) ఆయన భార్య సరస్వతమ్మ శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాదకర ఘటన చెన్నూరు పోలీసు స్టేషన్ పరిధిలోని రూకవారిపల్లెలో చోటుచేసుకుంది.

పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొర్రపాటి రవిశంకర్ ఆచారి, సరస్వతమ్మ దంపతులకు నలుగురు సంతానం. ఇందులో ఇద్దరు మగ పిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. కాగా పెద్దమ్మాయి ప్రేమ వివాహం చేసుకోవడంతో కుటుంబంలో మన స్పర్థలు ఏర్పడ్డాయి. అయితే కొద్ది రోజులకు పెద్దమ్మాయి కుటుంబంతో కలిసిపోయినప్పటికీ మనస్పర్థలు తొలగలేదు. అప్పటికే చిన్న కుమార్తె అయిన లిఖితేశ్వరి అమెరికా వెళ్లి చదువుకుంటానని తల్లిదండ్రులకు చెప్పగా వారు ఒప్పుకోకపోవడంతో, తన అక్కతో ఈ విషయాన్ని చెప్పి ఆమె ప్రోత్సాహంతో లా'చదువుల కోసం అమెరికాకు వెళ్లింది. పెద్ద కుమారుడు విక్రమ్ ఆదిత్య ఆచారి గ్లోబల్ ఇంజినీరింగ్ కాలేజీలో పార్ట్ టైం లెక్చరర్‌గా పనిచేస్తూ బచ్చుంపల్లెకు చెందిన ఒక అమ్మాయిని నాలుగు నెలల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. దీంతో తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ క్రమంలో రవిశంకర్ ఆచారి, చిన్న కుమారుడు వినయ్ ఆనంద్ ఆచారి వృత్తి రీత్యా బంగారు అంగడికి వెళ్లగా, సరస్వతమ్మ తన ఇంటిలో ఒక్కటే ఉండింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ఇంట్లో ఉండే విషద్రావణాన్ని తాగింది. మంట తాళ లేక గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు ఆమెను కడపలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. భార్య మరణ వార్త విన్న భర్త తాను పనిచేస్తున్న అంగడి వద్దకు వెళ్లి విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి, భార్యాభర్తల మృత దేహాలను చూసిన గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శుభకార్యానికి వెళ్తూ మృత్యువాత

- బైక్‌పై వెళ్తున్న దంపతులను ఢీకొన్న కారు
- భర్త దుర్మరణం, అపస్మారక స్థితిలో భార్య
- పల్టీకొట్టిన కారు, ఒకరికి గాయాలు


మృతి చెందిన అన్నయ్య


అపస్మారక స్థితిలో మధు


గాయపడిన రాజేష్

బి.కొత్తకోట : బి.కొత్తకోట నుంచి మదనపల్లె వైపు బైక్‌పై భార్యాభర్తలు, మదనపల్లె నుంచి బి.కొత్తకోట వైపు కారులో భార్యాభర్తలు శుభకార్యాల కోసం బయ లుదేరారు. వీరు గమ్యస్థానాలకు చేరుకోక ముందే మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ దుర్ఘటనలో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా. కురబలకోట మండలం మట్లివారిపల్లె పంచాయతీ ఎర్రమద్దువారిపల్లెకు చెందిన భార్యాభర్తలు వి.అన్నయ్య (45), మధు (40)లు బి.కొత్తకోటలో స్థిరపడి స్థానిక పీటీఎం రోడ్డులో పానీపూరి బండి నడుపుకొంటూ జీవిస్తున్నారు. సోమవారం తెల్లవారుజాము మూడు గంటలకు స్వగ్రామం ఎర్రమద్దువారిపల్లెలో వివాహ వేడుక ఉండటతో బైక్‌పై బయలుదేరారు. కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన జగదీష్ (26) పీలేరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను తన భార్య వాణితో కలిసి బి.కొత్తకోటలో జరిగే వివాహ వేడుక కోసం కారులో బి.కొత్తకోటకు బయలుదేరారు. బైక్, కారు మండలంలోని మొగసాలమర్రి బస్టాప్ వద్దకు రాగానే కారు అదుపుతప్పింది. కుడివైపు దూసుకొస్తూ బైక్‌ను ఢీకొంది. బైక్‌ను కారు కొద్ది దూరం లాక్కెళ్లింది. తర్వాత కారు పల్టీకొటి బోల్తా పడింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న వి.అన్నయ్య అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. భార్య మధు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కారులోని భార్యాభర్తలకు గాయాలయ్యాయి. ఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్మోహన్‌రెడ్డి, మరికొందరు కాపాడేందుకు ప్రయత్నించారు. కారులోని రాజేష్, వాణీలను బయటకు తీసి 108కు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న సీఐ శివాంజనేయులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అన్నయ్య మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా వివాహ వేడుకల కోసం వెళ్తున్న భార్యాభర్తలు ప్రమాదాలకు గురికావడం, వారిలో ఒకరు మృత్యువాత పడటంతో విషాదం నెలకొంది.


పల్టీకొట్టి ధ్వంసమైన కారు

దొంగతనాల నియంత్రణకు గస్తీ ముమ్మరం

జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్


సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ సిద్దార్థ కౌశల్

కొండాపురం : దొంగతనాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశించారు. జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలోని కొండాపురం సర్కిల్ కార్యాలయాన్ని, కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్లను ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ల పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. దిశ రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు, కొండాపురం సీఐ వేణుగోపాల్, ఎస్ఐ యోగేంద్ర, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ ఆర్. మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


ఓబులేసు మృతదేహం

లింగాల : లింగాల మండలం పార్నపల్లె కోనమల్లేశ్వరస్వామి ఆలయ సమీపంలోని వంకలో అనంతపురం జిల్లా ఎల్లుట్ల గ్రామానికి చెందిన ఓబులేసు (50) అనే వ్యక్తి మద్యంలో పురుగులమందు కలిపి తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. రెండు రోజుల క్రితమే అతను మృతి చెందినట్లు తెలుస్తోందన్నారు. ఈ విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలియజేశామన్నారు. ఘటనా స్థలంలోనే పోసుమార్టం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు.

చింతచెట్టు పైనుంచి కిందపడి వ్యక్తి మృతి


మృతి చెందిన చెన్నయ్య

పోరుమామిళ్ల : మండలంలోని కొర్రపాటిపల్లె దళితవాడకు చెందిన గొడ్లవీటి చెన్నయ్య(46) ఆదివారం సాయంత్రం చింతచెట్టు పైనుంచి కింద పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. చింత ఆకు కోసుకునే ప్రయత్నంలో కాలు జారి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు తెలిసింది. చెన్నయ్య మృతితో కొర్రపాటిపల్లె దళితవాడలో విషాదం అలుముకుంది.

బస్సు యాత్రను జయప్రదం చేయాలి

- జిల్లాలో మొదటి సభ ప్రొద్దుటూరులోనే
- కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఈనెల 28న సాయంత్రం ప్రొద్దుటూరులో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. బస్సు యాత్రకు సంబంధించిన ఏర్పాట్లపై ఆదివారం స్థానిక శేగిరెడ్డి కాటిరెడ్డి కల్యాణ మండపంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాకు సంబంధించి మొదటి సభను ప్రొద్దుటూరులోనే నిర్వహించాలని సీఎం వైఎస్ జగన్ చెప్పినట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారన్నారు. ఈనెల 28వ తేదీ ఉదయం పార్టీ నేతలు స్థానిక వైవీఆర్ కల్యాణ మండపానికి చేరుకుంటారని తెలిపారు. సాయంత్రం రామేశ్వరం, వన్ టౌన్ సర్కిల్, విజయకుమార్ థియేటర్, రాజీవ్ సర్కిల్ మీదుగా పుట్టపర్తి సర్కిల్‌కు ర్యాలీ ఉంటుందని వివరించారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. స్వాతంత్య్రం ఏర్పడ్డాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పదవులు ఇచ్చి వారి గౌరవాన్ని వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ నిలబెట్టిందన్నారు. అన్ని వర్గాలకు రాజ్యాధికారం కల్పించిన ఘనత మన ముఖ్యమంత్రి జగనన్నదేనన్నారు. బడుగు, బలహీన వర్గాలు ఆర్థిక సాధికారతలేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని వర్గాల కోసం సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవులు మొదలు, ఆలయ పాలక మండళ్లతో సహా అన్ని చోట్ల బీసీ వర్గాలకు ప్రాధాన్యత కల్పించిందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని వర్గాలకు పదవులు కట్టబెట్టిన ప్రభుత్వం తమదేనని తెలిపారు. బస్సు యాత్రకు సినీనటుడు ఆలీ, తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, మాజీ ఎంపీ బుట్టా రేణుక తదితరులు హాజరవుతారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, పద్మశాలీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ జేష్టాది శారద, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఆయిల్‌మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, రాజుపాళెం మండల వైస్ ఎంపీపీ ఎస్ఏ నారాయణరెడ్డి, ఏపీ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పన్నీటి కాశయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, చేనేత విభాగం జిల్లా అధ్యక్షురాలు మద్దూరి దేవి, కౌన్సిలర్ రాగుల శాంతితోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి, కల్లూరు నాగేంద్రారెడ్డి, కాకర్ల నాగేశారెడ్డి, మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళి పాల్గొన్నారు.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
23-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
232	82
65,398	19,543

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్	12,984	▽ 202
డోజోన్స్	33,127	▽ 287
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,402	▽ 97
డాక్స్	14,798	▽ 247
హాంషెంగ్	2,983	▽ 22
నికాయ్	31,259	▽ 171

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	[illegible]	82.43	84.10
£	బ్రిటన్ పౌండ్	[illegible]	99.44	102.75
€	యూరో	[illegible]	86.54	89.63
¥	జపాన్ ఎన్ (100)	[illegible]	54.73	56.44
AU$	ఆస్ట్రేలియా డాలర్	[illegible]	51.55	53.84
S$	సింగపూర్ డాలర్	[illegible]	59.70	61.63
SAR	సౌదీ రియాల్	[illegible]	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.73	23.53
¥	చైనా యువాన్	[illegible]	10.24	12.31

పాత బంగారం మార్చుకుంటున్నారా?

పండుగలు అంటే కేవలం ఖర్చు చేయడమే కాదు.. భవిష్యత్‌కు 'బంగారు'బాట వేసుకోవడం కూడా. నచ్చిన గృహోపకరణాలు, గ్యాడ్జెట్లు కొనే వారు, అందులో కొంత ఆదా చేసి భవిష్యత్ కోసం ఎందుకు ఇన్వెస్ట్ చేసుకోకూడదు? ఇలా ఆలోచించే కొందరు పండుగ సమయాల్లో బంగారం కొనుగోలు చేస్తుంటారు. బంగారం కేవలం అందాన్ని పెంచే ఆభరణం మాత్రమే కాదు, విలువను పెంచే ఆస్తి. అస్థిరతల్లో ర్యాలీ చేసే పెట్టుబడి సాధనం. కనుక పండుగ సమయాల్లో విలువ తరిగిపోయే వాటి కోసం వేలాది రూపాయలు ఖర్చు పెట్టేవారు.. పసిడికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నది నిపుణుల సూచన.

- ఆభరణం కోసమా.. పెట్టుబడి కోసమా?
- రెండింటికీ ఒక్కటే విధానం అనుకూలం కాదు
- అవసరమైతేనే కొత్త ఆభరణంతో మార్పిడి
- ఈ సమయంలో తయారీ, పన్నుల రూపంలో నష్టం
- పెట్టుబడి దృష్ట్యా మెరుగైన ప్రత్యామ్నాయాలు



గడిచిన కొన్నేళ్లలో బంగారం కొనుగోలు ఎన్నో మార్పులను సంతరించుకుంది. 20 ఏళ్ల క్రితం బంగారంపై పెట్టుబడి పెట్టే వారు అరుదుగా కనిపించే వారు. తర్వాత కాలంలో ఇందులో స్పష్టమైన మార్పు కనిపించింది. ముఖ్యంగా గడిచిన పదేళ్ల కాలంలో బంగారాన్ని పెట్టుబడి సాధనంగా అర్థం చేసుకోవడం పెరిగింది. గతంలో బంగారంపై పెట్టుబడి అంతా భౌతిక రూపంలోనే ఉండేది. ఇప్పుడు సార్వభౌమ పసిడి బాండ్లు (ఎస్‌జీబీలు), గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్, గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు) సాధనాలు అందుబాటులో ఉన్నాయి. అయినా, ఇప్పటికీ పెట్టుబడి దృష్ట్యా భౌతిక బంగారానికే ఎక్కువ మంది ప్రాధాన్యం ఇస్తున్నారు. ధంతేరస్ (ధనత్రయోదశి) వంటి ప్రత్యేక పర్వదినాల్లో పెద్ద ఎత్తున బంగారం కొనుగోళ్లు నమోదవుతుంటాయి. ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అయ్యే ఆస్తుల్లో బంగారానికి మొదటి స్థానం ఉంటుంది. నేటితరం పాత బంగారాన్ని, కొత్త ఆభరణాలతో మార్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. నిజానికి పాత బంగారం మార్పిడితో కొత్త ఆభరణాలు కొనుగోలు చేయడం సరైనదా..? ఆభరణాలను పెట్టుబడిగా చూడొచ్చా? పెట్టుబడి కోసం ఏ రూపంలో ఇన్వెస్ట్ చేయడం మెరుగు? ఈ విషయంలో నిపుణుల అభిప్రాయాలను ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం.

బంగారం మార్పిడి విధానం..?

పాత బంగారు ఆభరణాలను మార్చుకోవడం వెనుక ఎన్నో కారణాలు ఉండొచ్చు. మార్కెట్లోకి వచ్చే కొత్త డిజైన్ల పట్ల ఆసక్తి ఏర్పడొచ్చు. పాత నగలు డ్యామేజ్ కావొచ్చు. లేదంటే కొత్త ఆభరణాలు కొనుగోలు చేసుకోవడానికి బడ్జెట్ లేక పాత వాటిని మార్చుకోవచ్చు. కారణం ఏదైనా.. పాత బంగారం మార్చుకునే క్రమంలో కొంత నష్టపోతున్నామనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. పాత బంగారం ఆభరణాల మార్పిడికి సంబంధించి మన దేశంలో ప్రామాణిక విధానం అంటూ లేదు. వర్తకుల మధ్య వ్యత్యాసం కనిపిస్తుంది. ఆభరణం కొనుగోలు చేసిన వర్తకుడి వద్దే దాన్ని మార్చుకోవడం వల్ల గరిష్ట విలువను తిరిగి పొందడానికి అవకాశం ఉంటుంది. హాల్‌మార్క్ ఆభరణాలు అయితే బంగారం మార్కెట్ ధర మేర విలువను పొందొచ్చు. అయినా కానీ, ఆభరణాల తరుగు–తయారీ చార్జీలు అధికంగా ఉంటున్నాయి. బంగారం ధరలో 10–20 శాతం వరకు తరుగు, తయారీ చార్జీలను జ్యుయలరీ సంస్థలు వసూలు చేస్తున్నాయి. పాత ఆభరణాన్ని మార్చుకున్నప్పుడు అందులో తరుగు–తయారీ రూపంలో కొంత నష్టం ఏర్పడుతుంది. తిరిగి నూతన ఆభరణం కొనుగోలు చేయడం వల్ల, దాని తరుగు–తయారీ చార్జీల రూపంలో అదనంగా చెల్లించుకోవాల్సి వస్తుంది.

మార్చుకుంటే ఎంత కోల్పోవచ్చు..?		
	పాత ఆభరణం	కొత్త ఆభరణం
బరువు	20గ్రాములు	20 గ్రాములు
ధర (10 గ్రా.)	రూ.60,000 (సుమారు)	రూ.60,000
తరుగు–తయారీ చార్జీలు	లేవు	15 శాతం
పన్ను	వర్తించదు	3 శాతం
మొత్తం ధర	1,20,000	1,41,600

మార్చుకోవడం వల్ల కోల్పోయేది రూ.21,600

కొనుగోలు చేసిన వర్తకుడి నుంచి కాకుండా, వేరొక చోట పాత ఆభరణాన్ని మార్చుకునేట్టు అయితే ప్రక్రియ వేరుగా ఉంటుంది. వర్తకులు కొందరు కొన్ని అంశాల్లో ఏకరూప విధానాన్ని అనుసరిస్తుంటే, కొన్నింటి విషయాల్లో సొంత ప్రక్రియలను అమలు చేస్తున్నారు. పాత బంగారం ఆభరణాన్ని కరిగించి, స్వచ్ఛత చూసిన తర్వాత, కొత్త ఆభరణంతో మార్చుకోవడానికి చాలా సంస్థలు అనుమతిస్తున్నాయి. ''డిజిటల్ స్కేల్ సాయంతో బంగారం ఆభరణం బరువు చూస్తారు. దీని ఆధారంగా స్వచ్ఛతను బట్టి ధర నిర్ణయిస్తారు. సాధారణంగా అనుసరించే స్వచ్ఛతలు 24 క్యారట్ (99.9 శాతం స్వచ్ఛత), 22 క్యారట్ (91.6 శాతం స్వచ్ఛత), 18 క్యారట్ (75 శాతం స్వచ్ఛత). కొందరు జ్యుయలర్లు స్క్రాచ్ (గీయడం), యాసిడ్ టెస్ట్ ద్వారా బంగారం స్వచ్ఛతను నిర్ధారిస్తుంటారు''అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమోడిటీస్ హెడ్ హరీశ్.వి తెలిపారు. అన్నింటికంటే ప్రామాణికమైనది హాల్‌మార్క్ స్వచ్ఛత విధానం. భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) హాల్‌మార్క్ సర్టిఫికేషన్ సేవలు అందిస్తోందని, హాల్‌మార్క్ గోల్డ్ స్వచ్ఛత పరంగా విశ్వసనీయమైనదిగా హరీశ్ పేర్కొన్నారు. ఇప్పుడు పెద్ద సంస్థలు అయితే క్యారట్‌ను కొలిచే మెషీన్లను ఉపయోగిస్తున్నాయి. వీటినే గోల్డ్ అనలైజర్ మెషీన్లు అంటున్నారు. అందులో బంగారం లేదా ఆభరణాన్ని ఉంచితే బరువు ఎంత, ప్యూరిటీ ఎంత అనే వివరాలను ప్రదర్శిస్తాయి. ఉదాహరణకు వడోదరకు చెందిన రీనా దంపతులు ఎదుర్కొన్న అనుభవాన్ని తెలుసుకుంటే పాత బంగారం మార్పిడి ఇప్పుడు ఎంత సులభంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. వీరివద్దనున్న 20 గ్రాముల బంగారం చైన్ తెగిపోగా, 2014లో మార్చుకుందామని అనుకున్నారు. ఓ జ్యుయలర్ వద్దకు వెళితే, కంటితో చూసి 18 క్యారట్ల బంగారం అని ఖరారు చేసి, రూ.37,500 ధర చెల్లిస్తానని చెప్పాడు. అప్పుడు 10 గ్రాముల బంగారం ధర రూ.25,000 స్థాయిలో ఉంది. దీంతో వారు మార్చుకోలేదు. ఇటీవలే అదే చైన్‌ను ఓ వర్తకుడి వద్దకు తీసుకెళ్లగా, గోల్డ్ అనలైజర్ మెషీన్‌లో పెట్టి చూశారు. 22 క్యారెట్ల ప్యూరిటీ ఉన్నట్టు చూపించింది. దాన్ని కరిగించిన తర్వాత అసలు విలువ చెబుతానని అనడంతో, అందుకు రీనా దంపతులు ఒప్పుకున్నారు. కరిగించిన తర్వాత కూడా 22.1 క్యారెట్ నిర్ధారణ అయింది. దాంతో 10 గ్రాములకు రూ.61,000 చొప్పున విలువ కట్టారు. కొత్త ఆభరణం ధర కూడా అదే రీతిలో ఉండడంతో వారు మార్చుకునేందుకు సమ్మతించారు.

కొనుగోలు మార్గాలు.. చార్జీలు.. రిస్కులు				
సాధనం	కొనుగోలు మార్గం	రిస్క్	చార్జీలు	కనీస పెట్టుబడి
భౌతిక బంగారం	ఆభరణాలు, కాయిన్లు, కడ్డీలు	జాగ్రత్తగా కాపాడుకోవడం	లాకర్, తయారీ, ఇన్సూరెన్స్ వ్యయాలు	ఒక గ్రాము విలువ
డిజిటల్ గోల్డ్	యాప్స్ సాయంతో	నియంత్రణ, పర్యవేక్షణ లేదు	జీఎస్‌టీ పన్ను	రూపాయి నుంచి
గోల్డ్ ఈటీఎఫ్‌లు	షేర్ల మాదిరే, స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి	ధరల్లో రోజువారీ హెచ్చుతగ్గులు	ఫండ్ ఎక్స్‌పెన్స్ రేషియో, డీమ్యాట్ ఏఎంసీ చార్జీలు, బ్రోకరేజ్	ఒక గ్రాము నుంచి
గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్	ఏఎంసీల నుంచి, బ్రోకర్ల నుంచి	ఈటీఎఫ్‌ల మాదిరే	0.6-1.20 శాతం	రూ.100 నుంచి
ఎస్‌జీబీలు	ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంక్‌లు, బ్రోకర్ల సాయంతో	దాదాపుగా లేనట్టే	చార్జీల్లేవు. పైగా పెట్టుబడి విలువపై ఏటా 2.5 శాతం రాబడి	రూ.5,000 నుంచి



కొత్త ఆభరణాల కొనుగోలు

బంగారం కూడా ఒక ఆస్తే. ఎవరి పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోకైనా ఇది విలువను పెంచుతుంది. ఆభరణం కోసం కొంటున్నారా? లేక పెట్టుబడి దృష్ట్యా కొంటున్నారా? అన్న స్పష్టత అవసరం. భౌతిక బంగారం, ఆభరణాల రూపంలో ఇన్వెస్ట్ చేసుకునేట్టు అయితే తరుగు–తయారీ చార్జీలు, దానిపై జీఎస్‌టీ చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. స్వచ్ఛతకు సంబంధించిన సమస్యలు కూడా ఉంటాయి. నేడు చాలా జ్యుయలరీ సంస్థలు తమ వద్దే విక్రయిస్తే 100 శాతం విలువను చెల్లిస్తున్నాయి. ఒకవేళ ఆభరణంతో మార్చుకోకుండా, నగదు కోరితే మొత్తం విలువలో 5 శాతం వరకు తగ్గించి ఇస్తున్నాయి. పన్ను కోణంలో ఇలా చేస్తున్నాయి. ''జ్యుయలరీ అనేది సెంటిమెంటల్. మనోభావాలతో ఉంటుంది. ఒక తరం నుంచి ఇంకో తరానికి బదిలీ అవుతుంటుంది. అయితే అధిక తరుగు–తయారీ చార్జీల (10–20 శాతం)తో మార్చుకునేందుకు అయ్యే వ్యయం ఎక్కువ. దీనికితోడు జ్యుయలరీ కోసం స్టోరేజ్, లాకర్ చార్జీలను కూడా చెల్లించుకోవాల్సి రావచ్చు. భౌతిక బంగారం అయినా, ఆభరణాలు అయినా అవి వ్యక్తిగత ఆస్తులు. ఒక ఇన్వెస్టర్ పెట్టుబడుల విలువకు తోడు కావు. పెట్టుబడి కోసం అయితే బంగారం కడ్డీలు లేదా కాయిన్లను కొనుగోలు చేయడం కాస్త మెరుగైనది'' అని సెబీ నమోదిత ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ దిల్షద్ బిల్లిమోరియా సూచించారు. అయితే బంగారం కాయిన్లు, కడ్డీలను తిరిగి విక్రయించే సమయంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె అంటున్నారు. ''బ్యాంక్‌లు కాయిన్లు, కడ్డీలను విక్రయించడమే కానీ, వెనక్కి తీసుకోవడం లేదు. దీంతో వీటిని బయట విక్రయించుకోవాల్సి వస్తుంది. తరుగు, కరిగించేందుకు చార్జీలను ఆ సమయంలో వసూలు చేస్తున్నారు''అని బిల్లిమోరియా వివరించారు.

ఏమిటి మార్గం..?

ద్రవ్యోల్బణం ప్రభావాన్ని కాచుకునే చక్కని హెడ్జింగ్ సాధనం బంగారం అని నిపుణులు చెబుతున్నారు. బంగారంలో ఇన్వెస్ట్ చేయడం వల్ల ఎవరి పోర్ట్‌ఫోలియోలో అయినా వైవిధ్యం ఏర్పడుతుందని అంటున్నారు. కాకపోతే పెట్టుబడి దృష్ట్యా అయితే ఆభరణాల కంటే మెరుగైన ప్రత్యామ్నాయాలను పరిశీలించాలన్నది నిపుణుల సూచన. గోల్డ్ ఈటీఎఫ్‌లు, ఎస్‌జీబీలు, గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్‌ను ఇందుకు నిదర్శనంగా పేర్కొంటున్నారు. ''చారిత్రకంగా చూస్తే బంగారం ధరలు ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా సగటున ఏటా 5–11% మధ్య వృద్ధి చెందాయి. ద్రవ్యోల్బణం పెరిగే సమయంలో గోల్డ్ చక్కని హెడ్జింగ్ సాధనం. పెట్టుబడుల వైవిధ్యం దృష్ట్యా బంగారం ఒక మంచి పెట్టుబడి సాధనం అవుతుంది. అయితే అది కడ్డీలు లేదా జ్యుయలరీ రూపంలో ఉండకూడదు'' అని బిల్లిమోరీ సూచించారు. పీపీఎఫ్, కార్పొరేట్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటి సాధనాలు బంగారం మాదిరే వైవిధ్యానికి తోడు, మెరుగైన రాబడి, లిక్విడిటీతో ఉంటాయని చెప్పారు. కనుక పాత బంగారం మార్పిడి అనేది అవసరం ఆధారంగానే నిర్ణయించుకోవాలి. ఉపయోగించని ఆభరణాలను మార్చుకుని కొత్తవి తీసుకోవడం మంచి నిర్ణయం అవుతుంది. పెట్టుబడి కోసం అయితే ఆభరణాలకు బదులు నిపుణులు సూచించిన ప్రత్యామ్నాయాలను పరిశీలించడం మేలు. దీని వల్ల బంగారం విలువలో నష్టపోయే అవకాశం ఉండదు. 2010 వరకు బంగారం విలువ 10 గ్రాములు రూ.15,000 స్థాయిలోనే ఉండేది. కనుక పెట్టుబడుల దృష్ట్యా భౌతిక బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే వారు. కానీ, నేడు ధర గణనీయంగా పెరిగిపోవడంతో, పెట్టుబడి కోణంలో డిజిటల్ బంగారం సాధనాలకు ప్రాధాన్యం పెరుగుతోంది.

కొటక్ బ్యాంక్ లాభం అప్

క్యూ2లో రూ. 4,423 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కొటక్ మహీంద్రా బ్యాంక్ ఈ ఏడాది (2023–24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 24% జంప్‌చేసి రూ. 4,423 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ. 2,581 కోట్ల నుంచి రూ. 3,191 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 21% వృద్ధితో రూ. 6,297 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 5.22 శాతాన్ని తాకాయి. ఇతర ఆదాయం రూ. 1,832 కోట్ల నుంచి రూ. 2,314 కోట్లకు పుంజుకుంది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.08% నుంచి రూ. 1.72%కి తగ్గాయి.

అశోక్ వాస్వానికి సై: కొటక్ మహీంద్రా బ్యాంక్ కొత్త ఎండీ, సీఈవోగా బయటి వ్యక్తి అశోక్ వాస్వాని ఎంపికకు ఆర్‌బీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కొటక్ నాలుగు నెలల ముందుగానే ఎండీ, సీఈవో బాధ్యతల నుంచి వైదొలగుతున్న నేపథ్యంలో అశోక్‌ను బ్యాంక్ బోర్డు ప్రతిపాదించింది.

ఐసీఐసీఐ బ్యాంక్ లాభం జూమ్

క్యూ2లో రూ. 10,896 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 36% జంప్‌చేసి రూ. 10,896 కోట్లను తాకింది. ప్రొవిజన్లు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. స్టాండెలోన్ లాభం సైతం రూ.7,558 కోట్ల నుంచి రూ. 10,261 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం రూ. 31,088 కోట్ల నుంచి రూ. 40,697 కోట్లకు దూసుకెళ్లింది. నికర వడ్డీ ఆదాయం 24 శాతం వృద్ధితో రూ. 18,308 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 4.31 శాతం నుంచి 4.53 శాతానికి బలపడ్డాయి. ట్రెజరీ మినహా వడ్డీయేతర ఆదాయం 14 శాతం అధికమై రూ. 5,861 కోట్లయ్యింది.

ఎన్‌పీఏలు డౌన్...

తాజా సమీక్షా కాలంలో ఐసీఐసీఐ బ్యాంక్ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 3.19 శాతం నుంచి రూ. 2.48 శాతానికి తగ్గాయి. కనీస మూలధన నిష్పత్తి(సీఏఆర్) 16.07 శాతంగా నమోదైంది.

స్టాక్స్ వ్యూ

రామ్‌కో సిమెంట్స్	షేర్‌ఖాన్	కొనొచ్చు


ప్రస్తుత ధర: రూ. 991 టార్గెట్: రూ. 1,130



ఎందుకంటే: ప్రయివేట్ రంగ కంపెనీ రామ్‌కో సిమెంట్స్ దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరల వేగవంత పెరుగుదల, ఈ ఏడాది(2023–24) రెండో త్రైమాసికం (క్యూ2) తదుపరి ఇంధన వ్యయాలు తగ్గడం వంటి అంశాల కారణంగా లబ్ధి పొందే అవకాశముంది. దక్షిణాదిలో సగటు సిమెంట్ ధరలు అక్టోబర్ 5 నుంచి ఒక్కో బ్యాగుకి సుమారు రూ. 40 చొప్పున ఎగశాయి. వెరసి క్యూ2(జులై–సెప్టెంబర్)తో పోలిస్తే సిమెంట్ ధరలు 10 శాతం అధికంగా లభించనున్నాయి. సీజనల్‌గా ఈ ఆర్థిక సంవత్సరం క్యూ2 బలహీన కాలం అయినప్పటికీ బలమైన డిమాండ్ కనిపించింది. ఈ ట్రెండ్ పూర్తి ఏడాదిలోనూ కొనసాగే అంచనాలున్నాయి. పూర్తి ఏడాదికి సిమెంట్ అమ్మకాల పరిమాణంలో 20 శాతం వార్షిక వృద్ధిని కంపెనీ అంచనా వేస్తోంది. ఈ నెలలో అంతర్జాతీయ కోల్, దేశీ పెట్ కోక్ ధరలు నెలవారీగా చూస్తే 13–5 శాతం చొప్పున క్షీణించాయి. మరోవైపు ప్రాంతాలవారీగా సిమెంట్ ధరలు బలపడటంతో నిర్వహణ లాభాలు మరింత పుంజుకునేందుకు వీలుంది. నాన్‌ట్రేడ్ విభాగంపై కంపెనీ ప్రత్యేక దృష్టి సారించడం, అధిక ధరల ఉత్పత్తులు(ప్రీమియమైజేషన్), వ్యయ నిర్వహణా సామర్థ్యాలు, సిమెంటు విక్రయాలలో గరిష్ట ధరలను పొందడం, కొనసాగుతున్న పటిష్ట డిమాండు వంటి అంశాలు కంపెనీ నిర్వహణ లాభం, నికర లాభాలను భారీగా మెరుగుపరిచే అవకాశముంది. దీంతో కంపెనీ ఆర్జనలు పుంజుకోనున్నాయి. ఇది కంపెనీ రీరేటింగ్‌కు దారితీయవచ్చని భావిస్తున్నాం.

హిందాల్కో	మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 473 టార్గెట్: రూ. 570




ఎందుకంటే: అల్యూమినియం తయారీ దిగ్గజం హిందాల్కో ఇండస్ట్రీస్‌కు ఒడిషాలోని హీరాకుడ్, ఆదిత్య ప్లాంట్లను ఇటీవలే సందర్శించాం. తద్వారా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ మెటల్ తయారీ విధానాలు, కార్యకలాపాలను పరిశీలించాం. ఆదిత్య స్మెల్టర్ ప్లాంటు ప్రపంచంలోనే చౌక వ్యయాల, అత్యంత సమర్థవంతమైన యూనిట్లలో ఒకటిగా నిలుస్తోంది. అత్యంత ఆటోమేటెడ్ విధానంలో ఏర్పాటైన ఈ యూనిట్ కార్యకలాపాల నియంత్రణలో అతిఎక్కువ టెక్నాలజీతోపాటు, క్రేన్లు తదితరాలను వినియోగిస్తోంది. డౌన్‌స్ట్రీమ్‌లో ముడిసరుకులకు సంబంధించి ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలిమర్స్(ఎఫ్ఆర్‌పీ) విస్తరణపై ప్రత్యేక దృష్టిని సారిస్తోంది. తద్వారా లాభదాయకతను మరింత మెరుగుపరచుకునేందుకు వీలుంటుంది. ఇది వ్యయాల ప్రభావిత(ఆదా) సమీకృత విధానంలో భాగంకాగా.. సొంత హాట్ మిల్ సామర్థ్యం ద్వారానే ఎఫ్ఆర్‌పీ ప్రాడక్టులను రూపొందించుకోగలుగుతోంది. అత్యున్నత ఆటోమేషన్, టెక్నాలజీ వినియోగంతో పాటు.. తయారీ విధానంలో ప్రతీ చోటా వ్యయాల ఆదాకు మరింతగా ప్రయత్నిస్తోంది. తయారీలో అత్యంత రక్షణాత్మక చర్యలను అనుసరిస్తోంది. సామర్థ్యాన్ని గరిష్టంగా వినియోగించుకునే బాటలో సిమ్యులేషన్ ఆధారిత శిక్షణా విధానాలను అవలంబిస్తోంది. పటిష్ట బ్యాలన్స్‌షీట్ కలిగిన కంపెనీ అంతర్గత వనరుల ద్వారానే విస్తరణ సంబంధ పెట్టుబడి వ్యయాలను సమకూర్చుకుంటోంది. అత్యంత సమీకృత కార్యకలాపాలు కలిగిన కంపెనీ డౌన్‌స్ట్రీమ్ సామర్థ్య విస్తరణ ద్వారా లాభాలను భారీగా పెంచుకునే ప్రణాళికలు అమలు చేస్తోంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

పిల్లల ఉన్నత విద్యకు అనుకూల సాధనాలు?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

మార్కెట్లలో అస్థిరతలను ఇన్వెస్టర్లు అధిగమించడం ఎలా?
– కిరణ్

అస్థిరతలనేవి ఈక్విటీల సహజ లక్షణం. ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా చలిస్తుంటాయి. గడిచిన ఐదు, పదేళ్లుగా మార్కెట్లలో ఇదే ధోరణి కనిపిస్తోంది. ఇన్వెస్టర్లు వీటిని ఎదుర్కోడం ఎలా అన్నది తెలుసుకోవాలి. ఇందుకోసం కొన్ని చర్యలను అమలు చేయాల్సి ఉంటుంది. ముందుగా ప్రతీ ఇన్వెస్టర్ లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తీసుకుని తమకు, తమ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించుకోవాలి. అత్యవసర సందర్భాల్లో ఈక్విటీ పెట్టుబడులను కదిలించకుండా ఉండాలి. ఇందుకోసం ప్రత్యేకంగా అత్యవసర నిధిని (ఈఎఫ్) ఏర్పాటు చేసుకోవాలి. ఈక్విటీల్లో మీ పెట్టుబడులను కనీసం ఐదు నుంచి ఏడేళ్ల పాటు కదపకూడదు. ఈక్విటీ అస్థిరతలను అధిగమించేందుకు ఈ చర్యలు అవసరం. అలాగే, సిప్ వంటి సాధనాల ద్వారా ఇన్వెస్ట్ చేయడం వల్ల మార్కెట్ అస్థిరతల నుంచి ప్రయోజనాన్ని పొందొచ్చు. సిప్ రూపంలో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసే వారికి మార్కెట్లలో కరెక్షన్లు మంచి అవకాశాలను తెస్తాయి. ఎందుకంటే ఆ సమయాల్లో ఎక్కువ ఫండ్ యూనిట్లను తక్కువ ధరకే సమకూర్చుకోవచ్చు. మార్కెట్లు దిద్దుబాటుకు గురైతే చౌకగా కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. కానీ, మీడియాలో వచ్చే గందరగోళ సమాచారం ఇన్వెస్టర్లను నిరాశకు, అయోమయానికి, భయానికి గురి చేస్తుంది. దాంతో వారు ప్రతికూల సమయాల్లో పెట్టుబడులు చేయడానికి వెనుకాడుతుంటారు. పైగా కొందరు అమ్మకాలు కూడా చేస్తుంటారు. ఇదే అతిపెద్ద తప్పు. ఆ సమయంలో తప్పకుండా సిప్‌ను కొనసాగించాలి. వీలైతే సిప్ మొత్తాన్ని పెంచుకోవాలి. దీనివల్ల దీర్ఘకాలంలో మరిన్ని రాబడులు సమకూర్చుకోడానికి వీలుంటుంది.

నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి వయస్సు పదేళ్లలోపే ఉంటుంది. వారి ఉన్నత విద్య కోసం ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఇందుకు అనుకూల సాధనాలు ఏవి?
– విజయశ్రీ

పిల్లల విద్య కోసం ఏక మొత్తంలో ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలి?.. చాలా మంది తల్లిదండ్రులు సాధారణంగా ఎదుర్కొనే సందేహం ఇది. ప్రాపర్టీ విక్రయం లేదా బోనస్ లేదా తాతలు తమ మనవళ్లు, మనవరాళ్ల కోసం నగదు బహుమతి ఇచ్చినప్పుడు.. ఆ మొత్తాన్ని పిల్లల భవిష్యత్తు కోసం ఇన్వెస్ట్ చేయాలని చాలా మంది తల్లిదండ్రులు భావిస్తారు. ఇందుకోసం పలు మార్గాలు ఉన్నాయి. సాధారణంగా ఈ మొత్తాన్ని పిల్లల ఉన్నత విద్య కోసం ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటే అందుకు, సాధారణంగా పదేళ్ల కాల వ్యవధి ఉంటుంది. అటువంటప్పుడు ఈక్విటీలకు మించి మెరుగైన సాధనం లేదనే చెప్పాలి. ఈక్విటీల్లోనూ ఫ్లెక్సీక్యాప్ విభాగం అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ పథకాలు పెట్టుబడులను వైవిధ్యం ఉండేలా చూస్తాయి. అన్ని రంగాల పరిధిలో, భిన్న మార్కెట్ క్యాప్ కలిగిన (డైవర్సిఫైడ్) కంపెనీల్లో ఫండ్ మేనేజర్ పెట్టుబడులు పెడతారు.

ఒకవేళ పన్ను ప్రయోజనం కూడా కోరుకుంటే ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్)ను ఎంపిక చేసుకోవచ్చు. ఇవి కూడా ఫ్లెక్సీక్యాప్ మాదిరే పనిచేస్తుంటాయి. అన్ని రంగాలకు చెందిన కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రిస్క్ తగ్గించే విధంగా ఈఎల్ఎస్ఎస్ పథకాల పనితీరు ఉంటుంది. ఈ పథకాల్లో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేయడం ద్వారా సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనం పొందొచ్చు. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఐదేళ్ల కాలంలో సగటున 12 శాతానికి పైనే వార్షిక రాబడులు ఇచ్చాయి. ఈ రాబడి రేటు ప్రకారం ఎవరైనా రూ.లక్షను పదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేస్తే.. రూ.3.14 లక్షలు సమకూరుతుంది. ఈక్విటీల్లో అస్థిరతలు సహజంగా ఉంటాయి. కనుక ఫ్లెక్సీక్యాప్ పథకాల్లోనూ ఇదే కనిపిస్తుంది. అందుకనే ఈక్విటీల్లో ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కాకుండా, తమ దగ్గరున్న పెట్టుబడులను కొన్ని విడతలుగా ఇన్వెస్ట్ చేసుకోవాలి. మీ దగ్గర ఉన్న ఏక మొత్తాన్ని ఏదైనా డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి.. దాని నుంచి ప్రతి నెలా సిస్టమ్యాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) రూపంలో ఈక్విటీ పథకాల్లోకి మళ్లించుకోవాలి. మూడేళ్ల కాలంలో దీన్ని పూర్తి చేయాలి. దీనివల్ల మార్కెట్ల ర్యాలీ, కరెక్షన్లలోనూ ఇన్వెస్ట్ చేసినట్టు అవుతుంది.